ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

బుధవారం 21 ఆగస్టు 2024



లెనిన్ చిల్డ్రన్ హోమ్‌ని సీజ్ చేసిన అధికారులు

అనుమతి లేని లెనిన్ చిల్డ్రన్ హోమ్ సీజ్

- ప్రత్యేక మండల కమిటీ పరిశీలన
- ఎటువంటి అనుమతులు లేకపోవడంతో మూసివేత
- 25 మంది విద్యార్థినీ, విద్యార్థులను ఆశ్రమాలు, పోస్టు మెట్రిక్ హాస్టళ్లకు తరలింపు
- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి వెల్లడి

చింతపల్లి, ఆగస్టు 20: మండల కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న లెనిన్ చిల్డ్రన్ హోమ్‌ని ప్రత్యేక మండల కమిటీ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం కలెక్టర్ దినేశ్ కుమార్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి పర్యవేక్షణలో ప్రత్యేక మండల కమిటీ అధికారులు తహసీల్దార్ టి.రామకృష్ణ, ఏవో రవీంద్ర, ఎంఈవో పనసల ప్రసాద్, ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, ఏసీడీపీవో రామలక్ష్మి బాలసదనం, సెయింట్ ఆన్స్, బీసీ వెల్ఫేర్ వసతి గృహాలు, లెనిన్ చిల్డ్రన్ హోమ్‌లను తనిఖీ చేశారు. లెనిన్ చిల్డ్రన్‌హోమ్‌కు ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్టు ప్రత్యేక కమిటీ అధికారులు గుర్తించి సీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ లెనిన్ చిల్డ్రన్ హోమ్ నిర్వహణకు ... మిగతా 8వ పేజీలో



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలలు

ఆస్పత్రిలో ఉంచితే బతికేవారే..

- అస్వస్థతకు గురైన ముగ్గురిని తొలుత కోటవురట్ల సీహెచ్‌సీకి తీసుకువెళ్లిన ఆశ్రమ నిర్వాహకుడు
- ఆదివారం ఉదయానికి బాధితుల సంఖ్య పెరగడంతో ఇళ్లకు పంపి చేతులు దులుపుకున్న కిరణ్‌కుమార్
- మృతి చెందిన ముగ్గురిలో ఒకరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లిన విద్యార్థే

నర్సీపట్నం, ఆగస్టు 20:

కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ (పాసా) అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను నిర్వాహకుడు ఆస్పత్రిలోనే ఉంచితే బతికేవారని వైద్యులు చెబుతున్నారు. శనివారం అర్ధరాత్రి కొర్రా సుశాంత్ అనే విద్యార్థి వాంతులు చేసుకోవడంతో నిర్వాహకుడు కిరణ్ కుమార్ కోటవురట్ల సీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. ఆస్పత్రిలో వైద్యం చేసిన తర్వాత విద్యార్థిని తీసుకువెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం కొర్రా సుశాంత్‌తోపాటు పి.మౌనిక, జె.జాషువా కూడా వాంతులు, విరేచనాలతో బాధపడుతుండడంతో సీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. సీహెచ్‌సీ వైద్యుడు ప్రసాద్‌కు అనుమానం వచ్చి పిల్లలు ఏం తిన్నారని నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. సమోసాలు తిన్నారని అతను సమాధానం చెప్పాడు. ఆదివారం ఉదయానికి అనాథాశ్రమంలోని పిల్లలందరికీ వాంతులు, విరేచనాలు అవుతుండడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి పంపించేసి కిరణ్‌కుమార్ చేతులు దులిపేసుకున్నాడు. కలుషిత ఆహారం తిని మరణించిన ముగ్గురు పిల్లల్లో కోటవురట్ల సీహెచ్‌సీలో ఆదివారం వైద్యం చేయించుకున్న జాషువా కూడా ఉన్నాడు. పిల్లలను ఇంటికి పంపించకుండా సీహెచ్‌సీలో చేర్పినట్టయితే చనిపోయే పరిస్థితి వచ్చేది కాదని డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

ఇంకా 21 మంది ఏరియా ఆస్పత్రిలోనే..

అనాథాశ్రమంలో కలుషిత ... మిగతా 8వ పేజీలో

కోలుకుంటున్న గిరిజన విద్యార్థులు

- నిరంతర పర్యవేక్షణలో వైద్య సేవలు
- కేజీహెచ్‌లోని ఆరుగురు విద్యార్థులు కార్పొరేట్ ఆస్పత్రులకు తరలింపు

పాడేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నం ఘటనలో అనారోగ్యానికి గురై స్థానిక ఆస్పత్రిలో సోమవారం చేరిన ఎనిమిది మంది గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. వారు కోలుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు. కైలాసపట్నం ఘటనలో ఫుడ్ పాయిజన్‌కు గురై సీదరి సాయి, పాంగి కవిత, పాంగి జస్వంత్, పాంగి అభిషేక్, కొర్రా పవిత్ర, కిల్లో యశ్వంత్, కిల్లో సంజయ్‌తేజ, పాంగి వంశీ మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కలెక్టర్ ఆదేశాలతో ఎనిమిది విద్యార్థులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించారు. అలాగే పోలీస్, రెవెన్యూ సిబ్బందిని ఒక బృందంగా నియమించి, నిరంతరం వారి స్థితిగతులను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే రౌండ్ ద క్లాక్ సేవలందించేందుకు ఉన్న వైద్యులు, సిబ్బంది కాకుండా మరో ముగ్గురు స్టాఫ్‌నర్స్‌లను ప్రత్యేకంగా నియమించారు. వారికి అందుతున్న సేవలను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా పర్యవేక్షిస్తున్నారు.

ఆరుగురిని కార్పొరేట్ ఆస్పత్రులకు తరలింపు

ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో ఆరుగురు విద్యార్థులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మంగళవారం తెల్లవారుజామున వారిని కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ సోమవారం రాత్రే కేజీహెచ్‌కి చేరుకుని అక్కడ విద్యార్థులను పరామర్శించారు. వివిధ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న వారి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. ఈ క్రమంలోనే నర్సీపట్నం, డౌనూరు ఆస్పత్రుల నుంచి పలువురు విద్యార్థులను కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతున్నప్పటికీ మరింత మెరుగైన వైద్యం కోసం నయామి, ప్రభాస్, చరణ్‌లను మెడికవర్ ఆస్పతికి, పి.మౌనిక, పి.జస్సీకలను కిమ్స్‌కు, ఎస్.రవిని రెయిన్‌బో ఆస్పత్రిలో చేర్పించారు. వారిని కలెక్టర్ స్వయంగా పరామర్శించి, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ప్రస్తుతం మొత్తం 57 మంది విద్యార్థులు క్షేమంగానే ఉన్నారని అధికారులు తెలిపారు.



వైజాగ్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో విద్యార్థిని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్



కేజీహెచ్‌లో విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అనధికార హాస్టళ్లపై చర్యలు

ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరిక

పాడేరు: అనధికారికంగా నిర్వహించే హాస్టళ్లపై చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. కైలాసపట్నం ఘటనలో బాధితులైన విద్యార్థులను మంగళవారం ఆయన కేజీహెచ్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడారు. ఏజెన్సీలో అనధికారికంగా నిర్వహించే హాస్టళ్లపై చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే చింతపల్లిలో ఒక హాస్టల్‌ను మూయించామని, అనంతగిరి మండలం కాశీపట్నంలోని ఒక హాస్టల్‌ను గుర్తించి, అక్కడ విద్యార్థులను వివిధ ఆశ్రమ పాఠశాలల్లోకి తరలించామన్నారు. అలాగే అనధికార హాస్టళ్లను గుర్తించేందుకు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీ ప్రైవేటు హాస్టళ్లను తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే కేజీహెచ్‌లోని 38 మంది విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆరుగురు విద్యార్థులను కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేర్పించామని, పాడేరు, నర్సీపట్నం ఆస్పత్రుల్లోని విద్యార్థులు కోలుకుంటున్నారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో ఉన్న విద్యార్థులంతా క్షేమంగానే ఉన్నారన్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, తదితరులుఉన్నారు.



హోలీ స్పిరిటీ అనుమతులపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హోలీ స్పిరిట్ మిషనరీ హాస్టల్ మూసివేత

- ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం
- అనుమతులు లేకపోవడమే కారణం
- పిల్లలను సమీప ఆశ్రమాల్లో చేర్పించాలని మండల అధికారులకు సూచించిన పీవో

అనంతగిరి, ఆగస్టు 20: ప్రభుత్వ అనుమతులు లేకుండా మిషనరీ హాస్టళ్లను నడిపితే చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. మండలంలోని కాశీపట్నంలోని హోలీ స్పిరిట్ మిషనరీ హాస్టల్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి మిషనరీకి ఎటువంటి అనుమతులు లేకపోవడంపై సీజ్ చేయాలని మండల అధికారులను ... మిగతా 8వ పేజీలో

విచారణ కమిటీ ఏర్పాటు

వివరాలు సేకరించి పది రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం, 42 మంది అస్వస్థతకు గురికావడంతో దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్.. జేసీ జాహ్నవి అధ్యక్షతన విచారణ కమిటీని నియమించారు. విచారణ కమిటీలో జిల్లా విద్యాశాఖాధికారి ఎంపీ లక్ష్మమ్మ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి శిరీషా, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, డీసీహెచ్ శ్రీనివాసరావు, నర్సీపట్నం ఆర్డీవో జయరామ్, డీఎస్పీ మోహన్ ఉన్నారు. కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పది రోజుల్లో నివేదిక అందజేయనుంది. కమిటీలో అధికారులు ముఖ్యంగా సంఘటన చోటుచేసుకున్న కోటవురట్ల మండలం కైలాసపట్నంలో అనాథాశ్రమాన్ని సందర్శించి వివరాలు సేకరించ నున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులతో కమిటీ సభ్యులు మాట్లాడి సమగ్ర నివేదికను పది రోజుల్లో కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఒక్క కోటవురట్ల మండలంలో సంఘటనపైనే కాకుండా విచారణ కమిటీ జిల్లాలో అనుమతి లేకుండా నడుస్తున్న అనాథాశ్రమాలు ఎన్ని ఉన్నాయి?, ఆయా ఆశ్రమాల నిర్వాహకులు ఎవరు?, నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయనే వివరాలు సేకరించనుంది. అంతే కాకుండా జిల్లాలో అనుమతితో నడుపుతున్న మాకవరపాలెం ఇమ్మానుయేలు అనాథాశ్రమం, కోటవురట్ల, మునగపాక మండలం కొండకర్ల ఆవలో వున్న మరో నాలుగు అనాథాశ్రమాల్లో మౌలిక వసతులు, విద్యార్థుల వివరాలను సేకరించనున్నారు.

పడకేసిన పర్యాటకం

గత ఐదేళ్లుగా గాలికి వదిలేసిన వైసీపీ సర్కారు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పర్యాటకం వెలవెలబోతోంది. వైసీపీ ప్రభుత్వం ఒక్క రుషికొండ భవనంపైనే దృష్టి పెట్టి మిగిలిన వాటిని గాలికి వదిలేసింది. టీడీపీ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కూడా ఆసక్తి చూపలేదు. కొన్నింటికి ప్రారంభోత్సవాలు చేసి వదిలేసింది.

రాష్ట్రంలో టెంపుల్ టూరిజం కేంద్రమైన తిరుపతి తరువాత పర్యాటకులు అత్యధికంగా వచ్చేది విశాఖపట్నం జిల్లాకే. ఇక్కడ అరకులోయ అందాలు, విశాఖ, భీమిలి బీచ్ సొగసులు, బొర్రాగుహలు, లంబసింగి ఆకట్టుకుంటాయి. వైసీపీ హయాంలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో విశాఖ కేంద్రంగా పర్యాటక ఒప్పందాలు పదికి పైగా చేసుకున్నారు. అందులో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు. రూ.200 కోట్లతో దేవ్ భూమి సంస్థ రోప్‌వే ప్రాజెక్టులు చేపడతామని ఎంఓయూ చేసుకుంది. ఒక్కచోట కూడా రాలేదు. డ్రీమ్ వ్యాలీ సంస్థ వేయి కోట్ల రూపాయలతో గోల్ఫ్ గేటెడ్ కమ్యూనిటీ, 5 స్టార్ రిసార్ట్ కడతామని ఒప్పందం చేసింది. కనీసం డీపీఆర్ కూడా కాలేదు. మరో సంస్థ రూ.150 కోట్లతో ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపడతామని సంతకాలు చేసింది. అడుగు ముందుకు పడలేదు. ఇంకా రూ.250 కోట్లతో జల విహారాలు, రూ.120 కోట్లతో స్కై టవర్, రూ.100 కోట్లతో టన్నెల్ ఆక్వేరియం నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయి. వీటిలో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు. పర్యాటక శాఖ ఒప్పందాలు చేసుకోవడానికే పరిమితమై వాటిని పట్టించుకోకుండా వదిలేసింది.

- టీడీపీ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులపై నిర్లక్ష్యం
- పెట్టుబడిదారుల సదస్సులో పదికిపైగా ఒప్పందాలు
- ఒక్కటి కూడా కార్యరూపం దాల్చని వైనం
- అరకులో నిరుపయోగంగా డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, కళావేదిక
- అసంపూర్తిగా ఈట్ స్ట్రీట్, ట్రైబల్ హట్స్ ప్రాజెక్టులు
- విశాఖ, అరకు, భీమిలి ఉత్సవ్‌లకు కూడా చెల్లు చీటీ
- నేడు పర్యాటక శాఖా మంత్రి సమీక్ష

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వం వాటికి నిధులు మంజూరు చేయకపోవడంతో మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న అరకులోయలోని హరితావేలి రిసార్టులో టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.రెండున్నర కోట్లతో డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, థింసా కళావేదికలను నిర్మించింది. వీటిని అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. కానీ నేటికీ డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ మూతబడే ఉంది. అలాగే కళావేదిక కూడా నిర్వహణ లేక తుప్పలతో నిండిపోయి ఉంది. ఇదిలావుండగా అరకులోయ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తవలస హెచ్ఎన్‌టీసీ ఫామ్‌కు చెందిన 18 ఎకరాల్లో రూ.7 కోట్లతో ఈట్‌స్ట్రీట్, ట్రైబల్‌హట్ ప్రాజెక్టులను గత తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. పనులు జోరుగా జరుగుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం కొలువు దీరడంతో ఈ ప్రాజెక్టు మూలకు చేరింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 20 శాతంలోపు జరిగిన పనులను నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఈట్ స్ట్రీట్, ట్రైబల్ హట్‌లు తుప్పలు, మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా చింతపల్లి మండలం లంబసింగిలో 12 రిసార్ట్స్ నిర్మాణానికి టీడీపీ హయాంలో పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ముక్కుతూ మూలుగుతూ అందులో ఆరు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన ఆరింటికి కనీసం పునాదులు కూడా వేయలేదు. మేఘాలతో అలరించే చెరువులవేనం గ్రామానికి రహదారిని ప్రతిపాదించారు. మట్టి రోడ్డుతో సరిపెట్టేశారు. ఇక అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో గల కొండకర్ల ఆవకు సందర్శకుల సంఖ్య పెరుగుతున్నా మౌలిక వసతులు లేవు.



అందుబాటులోకి రాని అరకులోయలోని డ్రైవ్ ఇన్ రెస్టారెంట్

ఉత్సవ్‌లకు తిలోదకాలు

పర్యాటకులను ఆకర్షించేందుకు అడపాదడపా ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ ఉండాలి. తెలుగుదేశం హయాంలో ప్రతి ఏటా డిసెంబరులో విశాఖ ఉత్సవ్, భీమిలి ఉత్సవ్, అరకు ఉత్సవ్‌లు నిర్వహించేవారు. వైసీపీ హయాంలో ఒకే ఒక ఏడాది నిర్వహించారు. ఆ తరువాత పూర్తిగా ఆపేశారు. వాస్తవానికి ఈ ఉత్సవాలకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తారు. వీటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

నేడు పర్యాటక మంత్రి రాక

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధికారులతో సాయంత్రం ఐదు ... మిగతా 8వ పేజీలో

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

- పాడేరు ఏఎస్పీ ధీరజ్

160 కిలోల గంజాయి పట్టివేత

జి.మాడుగుల, ఆగస్టు 20:

మన్యంలో గంజాయి రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తామని పాడేరు ఏఎస్పీ ధీరజ్ స్పష్టంచేశారు. ఏవోబీ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న 160 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడుతూ.. జి.మాడుగుల-ఉరుము కూడలిలో మంగళవారం తమ సిబ్బంది వాహన తనిఖీలు చేస్తున్నారన్నారు. ఆ సమయంలో చింతపల్లి వైపు నుంచి వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా.. నాలుగు బ్యాగుల్లో 160 కిలోల గంజాయి ఉన్నట్టు ... మిగతా 8వ పేజీలో



పట్టుబడిన గంజాయి నిందితులతో ఏఎస్పీ ధీరజ్, సీఐ రమేశ్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

విద్యార్థులకు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ హితవు

పాడేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాల వంటి వాటికి దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ సూచించారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. వాటి వినియోగం, అక్రమ రవాణా కారణంగా భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. తల్లిదండ్రుల ఆశల మేరకు మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎటుంటి ప్రలోభాలకు గురిచేయాలని చూసినా తమకు సమాచారం అందించాలన్నారు. గ్రామాలకు వెళ్లినపుడు గంజాయి సాగు, అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలపై తల్లిదండ్రులు, గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మాదక ద్రవాలకు సంబంధించిన ఎటువంటి సమాచారమైన టోల్‌ఫ్రీ నంబర్ 9381123100కు కాల్ చేయాలన్నారు. సమాచారం తెలిపే వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న అమిత్‌బర్దార్

ఒలింపియన్ ఎర్రాజీ జ్యోతికి ఘన స్వాగతం



పారిస్ ఒలింపిక్ గేమ్స్‌లో పాల్గొని ముంబై నుంచి మంగళవారం రాత్రి విశాఖ చేరుకున్న అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ద ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రతినిధులు జ్యోతిని పుష్పగుచ్ఛాలతో అభినందించి స్వాగతం పలికారు...వార్త 7వ పేజీలో

క్రైం... crime news

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య



అనకాపల్లి టౌన్, ఆగస్టు 20: స్థానిక విజయ రామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్‌పీ దువ్వాడ ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన దొడ్డి వెంకటరమణ(42) తుమ్మపాలలోని శీతలపానీయాల డీలర్‌గా వ్యవహరిస్తున్నాడు. తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లే అతను ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు. అనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వేస్టేషన్ నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- భర్తే హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- కేసు నమోదు, విచారణ ప్రారంభించిన పోలీసులు



భారతి (ఫైల్)

చింతపల్లి, ఆగస్టు 20: మండల కేంద్రంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందింది. ఆమెది ఆత్మహత్య కాదని, భర అత్తమామలు హత్య చేశారని మృతురాలు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన్నట్టు సీఐ కె.రమేశ్ తెలిపారు. మృతురాలు బంధువులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. గొలుగొండ మండలం కొంగసింగికి చెందిన కర్రి భారతి(28)ని ఎనిమిదేళ్ల క్రితం చింతపల్లి నెయ్యలవీధికి చెందిన కర్రి మణికంఠ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రక్షాబంధన్ పురస్కరించుకుని సోదరుడుకి రాఖీ కట్టేందుకు భారతి స్వగ్రామానికి వెళ్లింది. ఆమె తిరిగి రాత్రి ఏడు గంటలకు చింతపల్లి చేరుకున్నది. భార్య రాఖీ కట్టడానికి స్వగ్రామానికి వెళ్లడం, ఆలస్యంగా ఇంటికి రావడంతో భార్యాభర్తలు రాత్రి గొడవ పడ్డారు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో భారతిని భర్త మణికంఠ కొట్టాడు. దీంతో మంగళవారం ఉదయం భారతి తన తండ్రి రమణ, సోదరుడు రాజుకి ఫోన్ చేసి అత్తవారి ఇంటిలో వేధింపులు తట్టుకోలేకపోతున్నానని, తనను ఇక్కడ చంపేసేలా ఉన్నారని, వెంటనే వచ్చి ఇంటికి తీసుకొని వెళ్లిపోండి అని చెప్పింది. భారతి మాట్లాడుతుండగానే ఫోన్ కట్ అయ్యిందని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గంట తరువాత భారతి ఫ్యాన్‌కి ఉరి వేసుకుని చనిపోయిందని భర్త మణికంఠ ఫోన్ చేయడంతో హుటాహుటిన చింతపల్లి వచ్చామని తండ్రి రమణ, సోదరుడు రాజు తెలిపారు. అయితే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి చీర కట్టుకుని ఆత్మహత్య చేసుకున్నదని భర్త మణికంఠ, మామయ్య వెంకన్న చెబుతున్నారు. అయితే భర్త మణికంఠ తల్లిదండ్రులతో కలిసి భారతిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై మృతురాలు తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు సీఐ రమేశ్, ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. భారతి మృతిపై లోతుగా విచారణ చేస్తున్నట్టు వారు చెప్పారు.

ఘాట్‌లో ఆటో బోల్తా

- తొమ్మిది మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషయం

జి.మాడుగుల, ఆగస్టు 20: మండలంలోని సొలభం ఘాట్‌లో ఆటో బోల్తా కొట్టడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబీకులు, వైద్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం వారపుసంత కావడంతో సొలభం పంచాయతీ ఎస్.కొత్తూరు నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో ఘాట్ దిగుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన కిల్లో చిట్టిబాబు, ఏడాది చిన్నారిలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే అదే గ్రామానికి చెందిన కె.రాజు, టి.నూకలమ్మ, టి.రూపవతి, పి.పద్మ, ఎస్.కొండబాబు, టి.యశ్వంత్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను జి.మాడుగుల పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ హనుమంతరావు క్షతగాత్రులను పరామర్శించారు.

హరియాణా ముఠా పనే...

- ఏటీఎంలలో దోపిడీ కేసు దర్యాప్తులో పురోగతి
- ఐదుగురు పాల్గొన్నట్టు గుర్తింపు
- అందులో ఒకరు పాత నేరస్థుడు
- నిందితుల కోసం వెళ్లిన ప్రత్యేక బృందాలు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏటీఎం కేంద్రాల్లో చోరీలకు పాల్పడుతున్నది హరియాణాకు చెందిన ముఠాగా పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అనకాపల్లి జిల్లా మునగపాకలోని ఎస్‌బీఐ ఏటీఎంను ఈనెల 16న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి రూ.14.4 లక్షలను ఎత్తుకుపోయారు. ఆ మరుసటిరోజే పెందుర్తి, తగరపువలసలో అదేతరహాలో రూ.33.4 లక్షలు అపహరించుకుపోయిన విషయం తెలిసిందే. చోరీ జరిగిన పెందుర్తి, తగరపువలస ఏటీఎంను సీపీ శంఖబ్రతబాగ్చి స్వయంగా పరిశీలించారు. ఈ తరహా నేరాలు గతంలో జరిగినందున పాత నేరస్థుల వివరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మునగపాక, పెందుర్తి, తగరపువలసల్లో ఒకే ముఠా చోరీకి పాల్పడినట్టు అంచనాకు వచ్చారు. ఐదుగురు వ్యక్తులు ఒక కారుతో పాటు బైక్‌పై వచ్చి మూడుచోట్ల చోరీ చేసి వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారని తెలిసింది. వీరంతా హరియాణాలోని నుహ్ జిల్లాకు చెందినవారని సమాచారం. వారిలో ఒకరు గతంలో నగరంలో ఇదే తరహా చోరీలు చేసినట్టు పోలీసులు నిర్ధారించినట్టు తెలిసింది. వరుసగా రెండు రోజులు చోరీలు చేయడం, తర్వాత కొంతకాలం ఆగి మళ్లీ ప్రారంభించడం... ఆ ముఠా ప్రత్యేకత అని, విశాఖ నగరంలోనే కాకుండా దేశవ్యాప్తంగా తిరుగుతూ ఈ తరహా దోపిడీలకు పాల్పడుతుంటుందని తెలిసింది. ఇదిలావుండగా చోరీ జరిగిన ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపాల్సిన తేదీ కంటే ఒకరోజు ముందుగానే నింపడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే బాధ్యతను బ్యాంకులు కొన్ని ఏజెన్సీలకు అప్పగిస్తుంటాయి. అలాంటి ఏజెన్సీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా దొంగల ముఠాతో సంబంధాలు కలిగివుండడం వల్ల ఒకరోజు ముందుగానే నగదు నింపారేమోనని కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. చోరీలకు పాల్పడిన ముఠా సభ్యులు ప్రస్తుతం హరియాణాలో ఉండడంతో అక్కడికి ప్రత్యేక బృందాలు వెళ్లినట్టు సమాచారం.

పెదగోగాడ ఆస్పత్రిని తనిఖీ చేసిన కేంద్ర బృందం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్రబృందం

చీడికాడ, ఆగస్టు 20: మండలంలోని పెదగోగాడ ప్రభుత్వ ఆస్పత్రిని సోమ, మంగళవారాల్లో కేంద్ర బృంద అధికారులు డాక్టర్ మినిమొలాన్, డాక్టర్ ఎలిజిబెత్ మిలీ వర్గీష్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో గ్రామీణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ముఖ్యంగా వైద్యపరంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రి లోపల అన్ని రూమ్‌లను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో వైద్యాధికారి కిలపర్తి ఉషచైతన్య, సిబ్బంది, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509





విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు

కేజీహెచ్‌కు మరో 28 మంది చిన్నారులు

- నర్సీపట్నం ఆస్పత్రి నుంచి తరలింపు
- మొత్తం 42 మందిలో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న ఆరుగురు ప్రైవేటు ఆస్పత్రులకు తరలింపు
- మిగిలిన వారికి కేజీహెచ్‌లో కొనసాగుతున్న వైద్య సేవలు



బ్యాటరీ వాహనంపై పిల్లల వార్డుకు తరలిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కలుషిత ఆహారం తినడం వల్ల అస్వస్థతకు గురైన చిన్నారులు మరికొంతమందిని మంగళవారం కేజీహెచ్‌లో తీసుకువచ్చారు. సోమవారం అర్ధరాత్రి వరకూ 14 మంది రాగా పీడియాట్రిక్ వార్డులో చేర్చుకుని సేవలు అందించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, కొయ్యూరు మండలం డౌనూరు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మరో 28 మంది పిల్లలను మంగళవారం తెల్లవారుజాము నుంచి కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. వీరిలో 24 మంది పూర్తిగా కోలుకున్నప్పటికీ ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా చిన్న పిల్లల విభాగంలోని జనరల్ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. మరో 12 మంది క్రమంగా కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న ముగ్గురు చిన్నారులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్రియాట్నిన్ లెవెల్స్ అధికంగా ఉండడంతోపాటు ఇప్పటికీ షాక్‌లోనే ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఎస్.రవి (8) అనే బాలుడిని మంగళవారం తెల్లవారుజామున రెయిన్ బో ఆస్పత్రికి తరలించారు. అలాగే, పి.మౌనిక (10), పి.జస్సిక (9)ల పరిస్థితి ఆందోళనకరంగానే ఉండడంతో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. మౌనిక సీరం క్రియాట్నిన్, యూరియా లెవెల్స్ అధికంగా ఉన్నట్టు గుర్తించారు. అదేవిధంగా జస్సిక పరిస్థితి కూడా మెరుగుపడకపోవడంతో కిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నయామి, ప్రభాస్, చరణ్‌లను మెడికవర్ ఆస్పతికి తరలించారు.

వీరుకాకుండా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో కె.సుశాంత్ (8)కు వాంతులు, విరేచనాలు అవుతుండడంతోపాటు కిడ్నీలో సమస్య ఉన్నట్టు గుర్తించి వైద్యం అందిస్తున్నారు. కె.మీరా (10) పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. బీపీ తక్కువగా ఉండడంతోపాటు సీరం క్రియాట్నిన్ లెవెల్ 3.6 వరకూ పెరిగింది. ఎం.నవీన్ (10) వాంతులు, విరేచనాలతో బాధపడుతుండడంతోపాటు షాక్‌లో ఉన్నాడు. పి.మౌనిక (3), కిల్లో జ్యోతి (11), ఎం.రంజిత్ (12), ఎం.ప్రశాంత్ (8), ఎస్.నాని (7), జి.వంశీ (6), జి.ధన్యతా (9), ఎం.కుమార్ (8), పి.నందిని (7), కె.సురేష్ (8), కె.గణేష్ (9), టి.రాహుల్ (10), టి.ఇజ్రాయిల్ (10), టి.దివ్య (13) లు కొద్దిగా డీ హైడ్రేషన్‌తో బాధపడుతున్నట్టు గుర్తించి సేవలు అందిస్తున్నారు. వీరంతా ఇప్పటికీ షాక్‌లోనే ఉన్నట్టు చెబుతున్నారు. మిగిలిన చిన్నారుల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు.

విద్యార్థుల మృతికి కారణమేమిటో?

- బిర్యానీ, సమోసాల్లో ఏది కలుషితమైందో..
- పోస్టుమార్టం నివేదిక వస్తే గానీ తెలియదంటున్న వైద్య ఆరోగ్యశాఖాధికారులు

కోటవురట్ల, ఆగస్టు 20: మండలంలోని కైలాసపట్నం పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ (పాసా) అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా, 42 మంది అస్వస్థతకు గురికావడానికి ప్రధాన కారణం ఏమిటో అధికారులకు అంతు చిక్కడం లేదు. శనివారం రాత్రి దాతలు ఇచ్చిన బిర్యానీ, సమోసాలను విద్యార్థులు తిన్నారు. అయితే ఇందులో దేని వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారో అర్థం కావడం లేదు. మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆ రిపోర్టు వస్తే గానీ దీనిపై స్పష్టత రాదని వైద్యఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. అనాథాశ్రమ నిర్వాహకుడు కిరణ్‌కుమార్ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని, ఆ విద్యార్థులకు సకాలంలో వైద్యం అందించి ఉంటే ప్రాణ నష్టం జరిగేది కాదని పలువురు అంటున్నారు.

2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యం

- అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి
- విశాఖలో ఘనస్వాగతం



విశాఖ చేరుకున్న జ్యోతికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20: 'పారిస్ ఒలింపిక్స్ మంచి అనుభవం ఇచ్చింది. 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరిగే సమ్మర్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించే దిశగా సాధన చేయడమే నా ముందున్న లక్ష్యం'..అని నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొని మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న ఆమెకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ద ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయం వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో జ్యోతి మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొంటున్న తొలి అథ్లెట్‌గా గుర్తింపు రావడంతో కొంత ఒత్తిడికి గురైనట్టు తెలిపింది. దీనికితోడు హీట్స్ ముందు రోజు వరకు గాయం కొంత ఇబ్బంది పెట్టిందని, అయినప్పటికీ క్వాలిఫై కావాలని రౌండ్-1లో పట్టుదలతో పరుగు తీసినా ఆశించిన ఫలితం సాధించలేకపోయానన్నది. అయితే ఉద్దండులైన అథ్లెట్లతో పోటీపడడంతోపాటు ఒలింపిక్స్ వంటి అతి పెద్ద ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై రేస్‌లో పాల్గొనడం మంచి అనుభవాన్నిచ్చినట్టు చెప్పింది. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో అకాడమీలు ఏర్పాటుచేసి మంచి శిక్షణ అందిస్తే ఉన్నత స్థాయి అథ్లెట్లు రూపొందుతారన్నది. ఔత్సాహికులకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం అందితే ఆసియా గేమ్స్, కామన్‌వెల్త్, ఒలింపిక్స్ వంటి అత్యున్నత స్థాయి ట్రాక్ అండ్ ఫీల్డ్ మీట్స్‌లో దేశానికి పతకాలు అందించే అథ్లెట్లు తయారవుతారని పేర్కొంది. జ్యోతికి స్వాగతం పలికిన వారిలో ఒలింపిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, కోశాధికారి మోహన్ వెంకటరామ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాధికారి జూన్ గ్యాలియట్, కోచ్‌లు, మాజీ ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- కలెక్టర్ విజయకృష్ణన్





హాజరైన అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహన్ని అందిస్తుందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిలాలోని పలువురు పారిశ్రామికవేత్తలు, అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామికంగా జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాల కల్పన, నిబంధనల క్రమబద్ధీకరణలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం పారిశ్రామిక విధానం 2024-29, ఎంఎస్ఈఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ-2024-29 రూపకల్పన ప్రక్రియ చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లాలో అందుబాటులో వున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయోగకరంగా ఉంటుందో జిల్లాలో పారిశ్రామిక వేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్లు, అసోసియేషన్ ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో డీఆర్‌వో బి.దయా నిధి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి జీఎం శ్రీధర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్ వివిధ శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



పట్టణంలోని మెయిన్‌రోడ్డు పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తుమ్మపాల, ఆగస్టు 20: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, వసతిగృహాల్లో మహిళా వైద్యులు, నర్సులు, ఉద్యోగుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపించాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా పీడీఎస్‌వో ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో కలిసి అనకాపల్లి మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించి నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకులు జి.ఉషా, లక్ష్మీకుమారి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

- కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై ఆందోళన



న్యాయస్థానం ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై మంగళవారం కోర్టు సముదాయం ఎదుట న్యాయవాదులు నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు దుర్గారావు, రోజా, తులసి, కుసుమ, కేవీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆందోళన



అచ్యుతాపురం జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం ఆందోళన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. దీని వల్ల కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు ధర్మిరెడ్డి వెంకట్, అడిగర్ల సుధీర్, నాయుడు, సీఐటీయూ నాయకులు రొంగలి రాము, కూండ్రపు సోమునాయుడు, విద్యాసంస్థల ప్రతినిధులు రాజాన అప్పలనాయుడు, ఆడారి సన్యాసిరావు, శివకృష్ణ, బి.శ్రీనివాస రావు తదితరులుప పాల్గొన్నారు.

పూడిమడక హార్బర్ నిర్మాణ పనుల పరిశీలన



పూడిమడకలో హార్బర్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, ఆగస్టు 20 : పూడిమడకలో నిర్మాణంలో ఉన్న హార్బర్ పనులను మత్స్యశాఖ, ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా హార్బర్ మ్యాప్‌ను పరిశీలించారు. హార్బర్ స్థితిగతుల గురించి మత్స్యకార నాయకులను అడిగి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో హార్బర్ నిర్మాణపు పనులు నత్తనడక నడిచిందని, త్వరిత గతిన పూర్తి చేసి మత్స్యకారులతో పాటు యువకులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని మత్స్యకార నాయకులు కోరారు. సీఐసీఈఎఫ్ డీడీ ఎంబీ బెల్లియప్ప, మత్స్యశాఖ జేడీ వి.వేంకటేశ్వర్లు, మేరిటైమ్ బోర్డ్ సీటీవో శివ శంకర్, డీఎఫ్‌వో పి.ప్రసాద్, ఏడీ షేక్ జాస్మిన్, ఎఫ్‌డీవోలు ప్రసాద్, రవితేజ, మత్స్యకార నాయకులు మేరుగు బాపునాయుడు, మేరుగు ప్రవీణ్ కుమార్, చేపల వేంకటరమణ, వేంకటరావు, అప్పలనాయుడు, దాసరి శ్రీను, మహేష్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల పీహెచ్‌సీలో తనిఖీలు

తుమ్మపాల, ఆగస్టు 20: మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ సబ్ సెంటర్‌ల్లో మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం నాయకురాలు డాక్టర్ లూసీకార్డిలియా మాట్లాడుతూ పీహెచ్‌సీ, హెల్త్ సబ్ సెంటర్‌లలో వైద్యసిబ్బంది రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు చూపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో జగదీశ్, ఎస్‌వో రామచంద్రరావు, సీహెచ్‌ఓ శారదా, సిబ్బంది పాల్గొన్నారు.

24న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, ఆగస్టు 20: జడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 24వ తేదీన ఒకటి నుంచి ఏడు వరకు జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించనున్నట్టు జడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులు హాజరుకావాలని కోరారు.

దువ్వాడ మీదుగా హైదరాబాద్, కటక్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఆగస్టు 20: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా హైదరాబాద్, కటక్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. 07165 నంబరు గల రైలు ఈనెల 27 నుంచి వచ్చే నెల 17 వరకు ప్రతి మంగళవారం రాత్రి 8.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 9.07 గంటలకు దువ్వాడ, సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07166 నంబరు గల రైలు ఈనెల 28 నుంచి వచ్చే నెల 18 వరకు ప్రతి బుధవారం రాత్రి 10.30 గంటలకు కటక్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.37 గంటలకు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బరంపూర్, కుర్దారోడ్డు, భువనేశ్వర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ANDHRA JYOTHI CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **CHALLA VENU** (Old Name), S/o. Challa Appala Naidu, resident of 2-50, Jalampalli, Anakapalli. Change my name from **CHALLA VENU** (Old Name) to **CHALLA VENUGOPALASWAMY** (New Name) henceforth I am being called as **CHALLA VENUGOPALASWAMY** (New Name), S/o. Challa Appala Naidu for all purposes.
AJV_192044

CHANGE OF NAME

★ I, **VANKAYALA BOJJI TALLI** (Old Name), W/o. Vankayala Apparao, resident of 45-48-21, Abid Nagar, Akkayyapalem, Visakhapatnam. Change my name from **VANKAYALA BOJJI TALLI** (Old Name) to **VANKAYALA BOJJI THALLI** (New Name) henceforth I am being called as **VANKAYALA BOJJI THALLI** (New Name), W/o. Vankayala Apparao for all purposes.
AJV_192045

PLOT FOR SALE

VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్ హౌస్‌ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర. **73372 42575.**
AJB_57

For Advertisement Contact :
9963231176
9966165093

FLATS FOR SALE

★ **Luxury 3 Bed Room** Flats for Sale, Yendada Main Road. South 1510 Sq.ft. 2 Road Corner. Rate 78 Lakhs Including amenities. Cont. 7989344212
AJV_192205

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పిల్లలను ఉన్నతంగా చదివించండి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్

» రేగలో పాఠశాల భవనం ప్రారంభం



రేగ ఎంపీపీ పాఠశాల అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న పీవో అభిషేక్

అరకులోయ, ఆగస్టు 20: గిరిపుత్రులను ఉన్నతంగా చదివించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. మండలంలో బొండాం పంచాయతీ రేగ గ్రామంలో ఎంపీ ల్యాడ్స్ రూ.8.5 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని మంగళవారం సర్పంచ్ భాస్కరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో పిల్లలకు విద్యాపరంగా చక్కటి పునాది పడితే ఉన్నత విద్యాధికులుగా ఎదుగుతారన్నారు. కైలాసపట్నంలో జరిగిన దుర్ఘటన దురదృష్టకరమన్నారు. ఎవరో వచ్చి పంపమన్నారని బయట ప్రాంతాలకు పిల్లలను పంపించవద్దన్నారు. ఏజెన్సీలో అన్నిచోట్ల ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, అదేవిధంగా 3వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకునేందుకు ఆశ్రమోన్నత పాఠశాలలు, కళాశాలలు అందుబాటులో ఉన్నాయన్నారు. గిరిజన సంక్షేమ శాఖకు చెందిన పాఠశాలలో పిల్లలను చేర్పించాలే తప్ప వేరొక ప్రాంతాల్లో రక్షణ లేని విద్యార్థులను పంపవద్దని హితవు పలికారు. బొండాం సర్పంచ్ భాస్కరరావు మాట్లాడుతూ సగంలో నిలిచిన అదనపు భవనానికి ఎంపీ ల్యాడ్స్ నిధులను మంజూరు చేయించి పూర్తి చేసినందుకు పీవో అభిషేక్‌కు దన్యవాదాలు తెలిపారు. అలాగే కరకవలస గ్రామంలో పాఠశాల భవనాన్ని మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భారతీరత్నం, హెచ్ఎం చిట్టిబాబు, టీడబ్ల్యూ ఏఈఈ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.


పాడేరు సెయింట్స్ ఆన్స్ హాస్టల్‌లో పరిస్థితులను ఆరా తీస్తున్న సీఐ నవీన్‌కుమార్

పాఠశాల హాస్టళ్లలో పోలీసుల తనిఖీలు

కైలాసపట్నం ఘటన నేపథ్యంలో ముందస్తు చర్యలు

పాడేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నం ఘటన నేపథ్యంలో పోలీసులు విద్యాలయాల్లోని హాస్టళ్లు, వంటకాలను మంగళవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా విద్యాలయాల్లోని హాస్టళ్లను తనిఖీలు చేయాలని ఎస్పీ అమిత్‌బర్దార్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోని అన్ని మండలాల్లో సీఐలు, ఎస్ఐలు సిబ్బందితో కలిసి విద్యాలయాల్లోని హాస్టళ్లలో పరిశుభ్రత, వంటకాల తయారీ, తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. భవిష్యత్తులో కైలాసపట్నం వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలనే లక్ష్యంతోనే ఈ తనిఖీలు చేపడుతున్నామని పోలీసులు అంటున్నారు. సీఐ డి.నవీన్‌కుమార్, ఎస్ఐ జి.లక్ష్మణరావు, బృందం మంగళవారం స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలలైన సెయింట్ ఆన్స్‌లోని హాస్టళ్లను తనిఖీ చేశారు. అలాగే ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పోలీసు అధికారులు వారికి సూచించారు. అలాగే విద్యార్థులకు ఆహారం పెట్టే విషయంలో సంబంధీకులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

మినుములూరు సర్పంచ్‌కు కొణతాల సత్కారం


సర్పంచ్ చిట్టమ్మను అభినందిస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పాడేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మను అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం తన నివాసంతో సత్కరించారు. సర్పంచ్ చిట్టమ్మకు దేశ రాజధానిలో జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఐదుగురు మహిళా ప్రజాప్రతినిధులకు ఈ అరుదైన అవకాశం దక్కగా, అందులో మినుములూరు సర్పంచ్ చిట్టమ్మ ఉన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో ఆమెను అనకాపల్లిలోని తన నివాసానికి ఎమ్మెల్యే కొణతాల ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు. మరింత ఉత్సాహంగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని, చిట్టమ్మను ఆదర్శంగా తీసుకుని గిరిజన సర్పంచులు ఏజెన్సీ అభివృద్ధికి పాటుపడాలని కొణతాల కోరారు. కార్యక్రమంలో జనసేన నేత లంకెల విశ్వేశ్వరరావు ఉన్నారు.

దిగువసంపాల సమస్యల పరిష్కారానికి చర్యలు


సంపాల పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో నవీన్‌కుమార్

పాడేరు రూరల్, ఆగస్టు 20: ఇరడాపల్లి పంచాయతీ మారుమూల దిగువ సంపాల గ్రామ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎంపీడీవో కె.సాయి నవీన్ తెలిపారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కొండపై గ్రామానికి కాలినడకన మంగళవారం వెళ్లిన ఆయన, అక్కడ గ్రామస్థులతో సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారి సౌకర్యం మెరుగుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వాటర్ ట్యాంక్, హౌసింగ్ పనులను పరిశీలించారు. పాఠశాల్లో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. డ్రాపౌట్లు లేకుండా చర్యలు చేపట్టాలని, భోజనం సక్రమంగా అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 15లోగా ఈ-పంట నమోదు చేసుకోండి


ఈ-పంట నమోదుతో కలిగే లాభాలను రైతులకు వివరిస్తున్న ఏవో

కొయ్యూరు, ఆగస్టు 20: మండలంలో రైతులంతా సెప్టెంబరు 15వ తేదీలోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఉమాదేవి సూచించారు. చింతలపూడి, బీడీపాలెం పంచాయతీలలో మంగళవారం వరి సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి సాధనకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ-పంట నమోదు విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఏవో మాట్లాడుతూ ఈ-పంట నమోదు ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరకు పంటను అమ్ముకునే అవకాశం కలుగుతుందన్నారు. ఇప్పటివరకు మండలంలో 90 శాతం వరినాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఏవో వెంట వీహెచ్ఏ, వీఏఏలు ఉన్నారు.

సీలేరు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం తగదు

టీడీపీ పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి తిరుమలరావు

సీలేరు, ఆగస్టు 20: ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ఇచ్చిన మాటకు వ్యతిరేకంగా గ్రామాన్ని ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం సరికాని టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి నక్కా తిరుమలరావు పేర్కొన్నారు. జీకేవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కో నూతనంగా నిర్మించే 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులయ్యే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం, ఇల్లు, ఇంటికి ఒకరి చొప్పున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో జిల్లా అధికారులు, జెన్‌కో ఉన్నతాధికారులు హామీ ఇచ్చారని, దీన్ని విస్మరించి కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న గిరిజన, గిరిజనేతరులను గ్రామం ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడ దారుణమని మండిపడ్డారు. దీనిపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.

జంగిల్ కటింగ్ చేపట్టరూ..!


రాకాసిరాయి సమీపంలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 20: మండల కేంద్రం నుంచి కుమడ, లక్ష్మీపురం, జోలాపుట్టు, పెదబయలు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు ఇరువైపులా జంగిల్ కటింగ్ చేట్టాలని ఆయా ప్రాంతీయులు కోరుతున్నారు. ప్రధాన రహదారులక ఇరువైపులా పిచ్చి మొక్కలు ఎక్కడికక్కడ ఏపుగా ఎదిగిపోయాయి. దాని కారణంగా ఎదురెదురు వాహనాలు దగ్గరకు వస్తేగాని గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ప్రమాదబరితమైన మలుపులకు తోడు రహదారులు పలు చోట్ల అంచులు దెబ్బతినడం, రహదారిపై గతుకులు ఏర్పడడంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. పెను ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

అనధికారిక వసతిగృహాలపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి, ఆగస్టు 20: ట్రస్టు పేరిట అనధికారిక వసతి గృహాల నిర్వాహకులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. ఆదివాసీ విద్యార్థులు లక్ష్యంగా చేసుకుని కొంత మంది ట్రస్టులను నిర్వహిస్తున్నారన్నారు. ఉచిత భోజన, వసతి, ఇతర ఖర్చులన్నీ తామే భరిస్తూ విద్యను అందిస్తామని ఆదివాసీలకు మాయమాటలు చెప్పి విద్యార్థులను తీసుకు వెళుతున్నారన్నారు. ఆదివాసీ పిల్లలను చూపించి నిధులు దండుకోవడానికి ట్రస్టు పేరిట వసతి గృహాలను నిర్వహిస్తున్నారన్నారు. కైలాసపట్నం తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాల,బాలికలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు

పాడేరు రూరల్, ఆగస్టు 20: ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ ఐఈసీ ఆనంద్ అన్నారు. గుత్తులపుట్టులోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, దబ్బాపుట్టు ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో డయేరియా అరికట్టడం తదితర ఏడు రకాల సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సాయి రాఘవ, మత్స్యలింగం, పంచాయతీ కార్యదర్శి ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కార్యకర్తలను పట్టించుకోవాలి'

జి.మాడుగుల, ఆగస్టు 20: పార్టీకి పనిచేసిన కార్యకర్తలను పట్టించుకోవాలని మండల నేతలు కోరారు. మంగళవారం టీడీపీ కార్యాయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీకి అహర్నిశలు కష్టించి పనిచేసిన వారిని గుర్తించకపోవడం శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన కార్యకర్తలకు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకటరమేశ్‌నాయుడు, ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, కోడ వెంకట సురేశ్‌కుమార్, లకే రామకృష్ణ, పిన్నయ్యదొర, నారాయణరాజు, అప్పారావు, రామన్నదొర, లక్ష్మణరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ విస్తృత సేవా కార్యక్రమాలు

అనంతగిరి, ఆగస్టు 20: మండలంలోని కొత్తూరు, లంగుపర్తి, రెండు పంచాయతీల్లో విశాఖపట్నం లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టారు. గంగవరం, లంగుపర్తి, పులుసుమామిడి పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, వితరణ చేశారు. అనంతరం నిరుపేద గిరిజనులు, వద్ధులకు రగ్గులు, చీరలు అందజేశారు. కార్యక్రమంలోని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మీ, కార్యదర్శి సత్యప్రకాష్, హెచ్ఎం పి.కృష్ణారావు పాల్గొన్నారు.

దోమలతో వచ్చే రోగాలపై అప్రమత్తం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 20: గిరిజనులు దోమల వల్ల కలిగే రోగాలపై అప్రమత్తంగా ఉండాలని పెదవలస వైద్యాధికారి పృథ్వీషా సూచించారు. ప్రపంచ దోమల నివారణ దినం పురస్కరించుని పంచాయతీ కేంద్రంలో అవనగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు సాధ్యమైనంత వరకు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంశీకష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

చింతపల్లి, ఆగస్టు 20: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థులు, అధ్యాపకులు 550 మొక్కలను నాటారు. మంగళవారం కళాశాల ఆవరణలో పచ్చదనం పెంచడంతో పర్యావరణాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు కళాశాలలో నాట్లు వేసేందుకు అవసరమైన మొక్కలను ఉచితంగా అందజేశారు. ఈమొక్కలను కళాశాల ఆవరణలో నాటారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ భారతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకురాలు లీలాపావని, ఈశ్వరరావు, గ్రంథాలయ అధికారి జగ్గత్‌రాయ్, ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు వినియోగించుకోండి: ఎమ్మెల్యే


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ, ఆగస్టు 20: గిరి రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఏడీ మోహన్‌రావు ఆధ్వర్యంలో సబ్సిడీతో మంజూరైన విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే విత్తనాలను బయట విక్రయించకుండా రైతులు పండించుకుని ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరి, జట్పీటీసీ సభ్యులు జానకమ్మ, ఎస్.రోషిణి, సర్పంచ్ వెంకటరావు, అరకు సర్పంచ్ శారద, వ్యవసాయ శాఖాధికారి నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

అరకులోయ, ఆగస్టు 20: అనకాపల్లి జిల్లా కోటవరట్ల మండలం కైలాసపట్నం అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని నలుగురు ఆదివాసీ విద్యార్థుల మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మానపడాల్, పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ మరణించిన నలుగురు విద్యార్థుల కుటుంబాలకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.

మావోయిస్టు పార్టీ సభ్యుడు లొంగుబాటు

చింతూరు, ఆగస్టు 20: డాక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు ఎదుట మావోయిస్టు పార్టీ సభ్యుడు మడివిగంగ లొంగిపోయాడు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మడివిగంగ చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందినవాడు. 2018లో నాటి కుంట ఏరియా మావోయిస్టు కమాండర్ సోడి గజేంద్ర ప్రోద్బలంతో మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడిగా మారాడు. అప్పటి నుంచి 2020 వరకు కుంట ఏరియాలో మిలీషియా సభ్యుడిగా వ్యవహరించాడు. అనంతరం కుంట ఏరియా కమిటీ సభ్యురాలు సోడి మంజుల నేతృత్వంలో మావోయిస్టు పార్టీలో చేరాడు. 2021 నుంచి 2023 వరకు కుంట కమిటీ దళ సదాసిగా పని చేశాడు. 2024లో పార్టీ సభ్యుడిగా పదోన్నతి పొంది కుంట ఏరియా కమిటీలో కొనసాగాడు. పార్టీ ఆదేశాల మేరకు రెండు సార్లు పోలీసులపై కాల్పుల్లో పాల్గొన్నాడు. కాలక్రమంలో మావోయిస్టు విధానాలకు విసుగు చెందడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన పునరావాస విధానాలు నచ్చి చివరకు పోలీసులు ఎదుట లొంగిపోయాడు. సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సీఆర్పీఎఫ్ ఏసీ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

బూరుగులో కాగడాలతో గిరిజనుల నిరసన


రాత్రి వేళ కాగడాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

అనంతగిరి, ఆగస్టు 20: స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పైబడినా తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేక చిమ్మ చీకటిలో మగ్గుతున్నామని రొంపల్లి పంచాయతీ బూరుగు గిరిజనులు కాగడాలతో మంగళవారం నిరసన తెలిపారు. ఎన్నో ఏళ్ల పోరాటం ఫలితంగా, పత్రికల్లో కథనాల పుణ్యమా అంటూ తమ గ్రామానికి విద్యుత్ స్తంభాలు వేశారని, అయితే విద్యుత్ తీగలు వేయడానికి కాలం గడుపుతున్నారని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. , జలజీవన్ మిషన్‌లోని బోరు ఏర్పాటు చేసినప్పటికీ, విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో నేటికి ఊటనీరే గతైందని, ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను వేసి, వార్డు సభ్యులు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

వైద్య విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగేవరకూ పోరాటం

చింతపల్లి/అనంతగిరి ఆగస్టు 20: వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగేవరకూ పోరాడతామని పలు సంఘాల నాయకులు స్పష్టం చేశారు. అనంతగిరి, చింతపల్లి మండల కేంద్రాల్లో మంగళవారం నిరసన కొవ్వొత్తులతో ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థిపై జరిగిన అత్యాచారం, హత్యపై ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు శెట్టి మోహన్‌రావు, మణికంఠశేఖర్, సాలేబు సన్యాసిరావు, అడ్డాల బాబి, ఎస్.గౌతం, పాంగి రాంబాబు, శుభ కాంగ్, బూర్జ లక్ష్మి, కిల్లో భీమల, మెట్రిన్ రాజ్యలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

... 5వ పేజీ తరువాయి

గుర్తించామన్నారు. గంజాయిని రవాణా చేస్తున్న చింతపల్లి మండలం బలపం పంచాయతీ గుంజివీధికి చెందిన కొర్రా మోహన్‌రావు, కొత్తపాలెం పంచాయతీ, కడశిల్పకి చెందిన కొర్రా సన్యాసిరావులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే తమిళనాడుకు చెందిన రాజేశ్, చింతపల్లి మండలానికి చెందిన కొర్రా బలరాం పరారీలో ఉన్నారన్నారు. త్వరలో వారిని పట్టుకుంటామన్నారు. గంజాయిని రవాణాకు ఉపయోగించిన ఆటో, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. సమావేశంలో సీఐ రమేశ్, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పడకేసిన పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

గంటలకు వీఎంఆర్‌డీఏలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఏడు గంటలకు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ముచ్చటిస్తారు. రాత్రికి ఇక్కడే బస చేసి గురువారం మూడు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో పర్యాటక అంశాలపై సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి రాజమండ్రి బయలుదేరి వెళతారు

ఆస్పత్రిలో ఉంచితే బతికేవారే..

... 5వ పేజీ తరువాయి

ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో ఇంకా 21 మంది గిరిజన విద్యార్థులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మంగళవారం చికిత్స పొందుతున్నారు. ఏరియా ఆస్పత్రికి 60 మంది విద్యార్థులను తరలించగా, సత్వర వైద్య సేవలు అందించి 38 మందిని విశాఖపట్నం తరలించారు. మిగిలిన 22 మందిలో మంగళవారం ఉదయం ఒక చిన్నారి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం తరలించారు. ఇంకా 21 మంది గిరిజన విద్యార్థులు పిల్లల వార్డులో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల వాంతులు, విరేచనాలకు సంబంధించి శాంపిల్స్ పరీక్షకు పంపినట్టు అధికారులు తెలిపారు. కాగా అనాథాశ్రమ నిర్వాహకుడు, పాస్టర్ కిరణ్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరిచి నర్సీపట్నం సబ్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్టు డీఎస్పీ మోహన్ తెలిపారు.

హోలీ స్పిరిట్ మిషనరీ హాస్టల్ సీజ్

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. హాస్టల్‌లో 37 మంది పిల్లలు ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం రెండు రోజులు సెలవులు కావడంతో 11 మంది మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. వీరు కాశీపట్నంలోని ప్రభుత్వ ఎంపీయూపీ పాఠశాలలో 2వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థులను సమీప ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న 11 మంది పిల్లలను తల్లిదండ్రుల సమక్షంలో వారి ఇళ్లకు పంపించారు. ఎవరైనా అనుమతులు లేకుండా ప్రైవేటు హాస్టళ్లు నడిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీవో వెంట ఎంపీడీవో నగేష్, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో కిల్లో బాలాజీ, ఈవోపీఆర్డీ తోటరావు, ఎస్ఐ కరక రాము, తదితరులు ఉన్నారు.

అనుమతి లేని లెనిన్ చిల్డ్రన్ హోమ్ సీజ్

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి అనుమతులు లేవన్నారు. హోమ్ నిర్వాహకులు సునీతను రికార్డుల కోసం ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారన్నారు. హోమ్‌లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుతున్న 25 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థుల అడ్మిషన్ రిజిస్ట్రర్, హాజరు పుస్తకం, మెనూ, ఇతర రికార్డులు లేవన్నారు. విద్యార్థులకు సరైన వసతి లేదన్నారు. బాలికలు, బాలురు ఒకే భవనంలో నివాసం ఉంటున్నారన్నారు. ఈ హోమ్‌లో ఉంటున్న విద్యార్థులను ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, పోస్టు మెట్రిక్ వసతి గృహాలకు తరలించామన్నారు. రెండో తరగతిలోపు విద్యార్థులను సెయింట్ ఆన్స్ వసతి గృహానికి తరలించామన్నారు. లెనిన్ హోమ్ సీజన్ చేసినట్టు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం పంపించామన్నారు. అనాథ ఆశ్రమాలు నిర్వహించేందుకు కచ్చితంగా ప్రభుత్వ అనుమతి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్ కిరణ్, ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్

పాడేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ ప్రక్రియను పశు సంవర్థక శాఖాధికారులు మంగళవారం ప్రారంభించారు. జాతీయ పశు వ్యాధుల నియంత్రణ పథకంలో భాగంగా ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు మూగజీవాలకు గాలికుంటు వ్యాధి రాకుండా వాక్సినేషన్ ప్రక్రియను చేపట్టాలనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన. ఈ మేరకు స్థానిక పశు సంవర్థక శాఖ డీడీ నరసింహులు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడేరు పరిసర గ్రామాల్లో జీవాలకు టీకాలు వేశారు. వర్షా కాలం నేపథ్యంలో మూగజీవాలకు గాలికుంటు వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని, వ్యాక్సిన్ వేయించుకుంటే ఈ ముప్పు నుంచి వాటిని కాపాడవచ్చని అసిస్టెంట్ వెటర్నరీ అధికారి వెంకటరమణ తెలిపారు. గ్రామాల్లోని మూగజీవాలకు విధిగా వ్యాక్సిన్లు వేయించుకోవాలని ఆయన కోరారు.

సమతుల ఆహారం ఆరోగ్యకరం

కొయ్యూరు, ఆగ స్టు 20: గర్భవతులు, బాలింతలు ఆరోగ్య వంతంగా ఉండాలంటే సమతుల ఆహారం తీసుకోవాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. మండలంలోని చింతలపూడి, లొద్దిపాకలు, సింగరాలపాడు, గింజర్తి తదితర అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సీడీపీవో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, కిచెన్ గార్డెన్లు నిర్వహణను పరిశీలించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణితో మాట్లాడి ఆరోగ్య సూత్రాలను వివరించారు. సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కేంద్రాల నిర్వహణ తీరుపై ఆరా తీసి సక్రమంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. సీడీపీవో వెంట సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జడ్పీటీసీ పరామర్శ

కొయ్యూరు, ఆగస్టు 20: కైలాసపట్నం అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తినడంతో మరణించిన బాలిక కుటుంబాలను జెడ్పీటీసీ వారా నూకరాజు మంగళవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. డౌనూరు పంచాయతీ రెల్లలపాలెంకు చెందిన గెమ్మెలి భవానీ కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై మరణించిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు గ్రామానికి వెళ్లి బాధిత తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఘటన ఎలా జరిగింది అనే విషయాన్ని అడిగి తెలుసుకుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్ తిరుమలరావుకు కోరారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

జి.మాడుగుల, ఆగస్టు 20: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని పశువైద్యాధికారిని సృజన సూచించారు. జి.మాడుగుల పంచాయతీ జీఎం.కొత్తూరు, వైబీ గొందురు గ్రామాల్లో మంగళవారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా సెప్టెంబరు చివర వరకు ఈ కార్యక్రమం చేపట్టానున్నట్టు డాక్టర్ సృజన చెప్పారు. బందవీధి వైద్యాధికారి కుసుమ ప్రియదర్శిని, సిబ్బంది కొండబాబు, రఘునాథ్, వెంకట్, శ్యామ్‌ప్రసాద్, మత్స్యలింగం పాల్గొన్నారు.

పరిశుద్ధ తాగునీటితో వ్యాధులు దూరం

జి.మాడుగుల, ఆగస్టు 20: పరిశుభ్రమైన తాగునీరు వాడకంతో వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని జేజేఎం, డీపీఎంయూ జిల్లా కో-ఆర్డినేటర్ పుల్లయ్య చెప్పారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పాలకొండ, పద్మపురం, కొక్కిరాపల్లి గ్రామాల్లో ఇళ్ల కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిని బృందం పరిశీలించింది. అంగన్‌వాడీలు, పాఠశాలల ట్యాంక్‌లు, గ్రామ నీటి పారిశుద్య కమిటీలను తనిఖీలు చేశారు. కలుషిత నీరు, ఆహార కాలుష్యం వల్ల అతిసార వ్యాధులు ప్రభులుతాయని చెప్పారు. అతిసారకు గురైన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం పెండ్యాల రాజేశ్, పంచాయతీ సిబ్బంది ఝాన్సీరాణి, హెచ్ఎం రాంబాబు, రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్సు ఉపాధ్యాయులతో ఎంఈవో సమావేశం

సీలేరు, ఆగస్టు 20: సీలేరు, దారకొండ స్కూల్ కాంప్లెక్సు పరిధిలోని ఉపాధ్యాయులతో ఎంఈవో రామన్న మంగళవారం సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యం పరిశీలించేందుకు ఈ నెల 23న బేస్‌లైన్ టెస్టు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దీని కోసం ఈ నెల 21, 22 తేదీల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు.

పాడేరులో దోమల నివారణపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

పాడేరు రూరల్, ఆగస్టు 20: ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విద్యార్థులతో కలిసి మంగళవారం ర్యాలీ చేశారు. శ్రీకృష్ణాపురం పాఠశాల నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ముందుగా శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాల్లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో షేక్ జమీల్ భాషా మాట్లాడుతూ జిల్లాలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆరోగ్య విద్య, కళాజాత, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించి ప్రజల భాగస్వామ్యంతో దోమల నివారణకు పనిచేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది టి.తులసి, డి.శేషయ్య, ఏజే.సత్యనారాయణ, వైద్య సిబ్బంది కె.దుర్గాభవాని, బి.ఎలిషారావు, ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

దోమలపై దండయాత్ర

అనంతగిరి, ఆగస్టు 20: మండల కేంద్రంలో ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణలో భాగంగా చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాశీపట్నం పంచాయతీలోని మండపర్తి, తట్టవలస గ్రామాల్లో ఫీవర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో నరసింగరావు, ఎంపీహెచ్ఏ దేముడు, ఏఎన్ఎం దివ్య, ఎంఎల్‌హెచ్‌పీ జానకీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.